క్లుప్తంగా

కరేడు రామాలయంలో ఎమ్మెల్యే పూజలు



కరేడు రామాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మానుగుంట

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు అంబేద్కర్‌నగర్‌లో వెలసిన రామాలయంలో శనివారం కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయంలో శనివారం సీతారాముల కళ్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం వైభవంగా సాగింది.

13న షాపుల బహిరంగ వేలం

కందుకూరు: పాత కూరగాయల మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల బహిరంగ వేలాన్ని పరిపాలనా కారణాల రీత్యా ఈ నెల 7వ తేదీకి బదులు 13వ తేదీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. జనరల్ కేటగిరీ కింద ఉన్న 2,3,4,5,6,7,8 నంబర్ షాపులకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి ముందుగా రూ.1,00,000 ధరావత్తు చెల్లించడంతో పాటు రూ.2,000,000 సాల్వెన్సీ కింద మున్సిపాలిటీకి కట్టాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ముత్యాలగుంట పార్కుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం పార్క్‌లో టీ, కాఫీ, స్నాక్స్, డ్రింక్స్, తినుబండారాలు విక్రయించేందుకు ఒక రూము నిర్మించామని, ఈ రూంను అద్దె ప్రాతిపదికన కేటాయిస్తామన్నారు. దీనికి సంబంధించి ఈనెల 13వ తేదీనే మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు రూ.50,000 ధరావత్తు, రూ.1,00,000 సాల్వెన్సీ కింద చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఏమైనా సందేహాలుంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పీసీపల్లి: మండల పరిధిలోని చిలుకూరివారిపల్లిలో శనివారం రాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చదవడం అలవాటుగా మార్చుకోవాలి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉలవపాడు: చదవడం విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. ప్రతి విద్యార్థి చదవడం వల్ల జ్ఞానం వస్తుందన్నారు. నీతి కథలు చదవించి వాటిలో నీతి రాయించారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందచేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సింగరాయకొండలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచి తాటిపర్తి వనజ

సింగరాయకొండ(టంగుటూరు): సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సింగరాయకొండ సర్పంచి తాటిపర్తి వనజ సూచించారు. సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని 4 సచివాలయాల సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలని చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సైదలు, సచివాలయ సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సుశీల, సంజీవరెడ్డి, హరిత, పద్మ పాల్గొన్నారు.

గేదెల దొంగలు అరెస్టు

- రూ.40 వేల నగదు, 4 గేదెలు, మినీలారీ, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రత్నాకర రామరాజు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామరాజు, పక్కన సీఐ, ఎస్సైలు

కనిగిరి రూరల్: గేదెల అపహరణ కేసులో నల్గురు దొంగలను శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40 వేల నగదు, నాల్గు గేదెలు, మినీ లారీ బైక్ రికవరీ చేశారు. ఈమేరకు డీఎస్పీ రత్నాకరరామరాజు స్థానిక కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. హెచ్‌ఎంపాడు మండలం వేముల పాడుకు చెందిన మాలపాటి రామిరెడ్డికి చెందిన గేదెలు గత నెల 26వ తేదీన అపహరణకు గురైయ్యాయి. ఈ మేరకు మాలపాటి రామిరెడ్డి గత నెల 29న హెచ్‌ఎంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్ రామరాజు ఆధ్వర్యంలో, కనిగిరి సీఐ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఎస్సై కృష్ణ పావని, పోలీసు సిబ్బంది టీం గా ఏర్పడి గాలింపు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో కొంత మేర సమాచారం రాబట్టిన పోలీసులు శనివారం కొనకనమిట్ల మండలం దొనకొండ జంక్షన్ (ఎస్ హెచ్ 565) రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా, మినీ లారీలో నాల్గు గేదెలను తీసుకెళ్తు నల్గురు వ్యక్తులు అనుమానస్పందంగా కన్పించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. గేదెల దొంగతనానికి పాల్పడిన కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన యాసారపు శ్రీను, యాసారపు నరసింహా, యల్లం గోవిందయ్య, మిట్టపల్లి సుభాన్‌లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వీరి వద్ద నుంచి నాల్గు గేదెలు, రూ.40 వేల నగదు, దొంగతనానికి ఉపయోగించే మినీ వాహనం, మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో సీఐ శివరామకృష్ణారెడ్డి, హెచ్‌ఎం పాడు ఎస్సై కృష్ణపావని తదితరులున్నారు.

మేతలో ఉన్న గేదెలను ఎత్తుకెళ్లే ముఠా..

గేదెల అపహరణ కేసులో పట్టుబడిన దొంగలు పలు కేసుల్లో నేరస్తులుగా పోలీసులు తెలిపారు. వీరిలో యాసారపు శ్రీను పై కొనకనమిట్ల స్టేషన్‌తో పాటు పలు చోట్ల కేసులు ఉన్నట్లు వివరించారు. గ్రామానికి బయట పొలాల్లో మేతలో ఉన్న గేదెలనే టార్గెట్ చేస్తూ గేదెల అపహరణకు పాల్పడుతుంటారని పోలీసులు వెల్లడించారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ



మోపాడులో భూమిపూజలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు రూరల్: మండలంలోని మోపాడులో వేసిన జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. సచివాలయ పరిధిలో 95 గృహాలు మంజూరు కాగా 16 గృహాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాను రాను దేశ జనాభా పెరుగుతుందే గానీ భూమి మాత్రం పెరగదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా అవసరాలకు, రోడ్లకు భూమిని వాడుకుంటూనే ఉన్నామన్నారు. భూమిని వాడుకున్న సమయంలో అందులో ఉన్న చెట్లను కూడా నరికేస్తున్నారన్నారు. ఎస్టీలంతా ప్రభుత్వం ద్వారా నిర్మించే గృహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య, ఎంపీడీఓ పి.వి జయశేఖర్, కనపర్తి రమేష్ తదితరలు పాల్గొన్నారు.

కొండపిలో 778 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి ఎస్.కండ్రిక, పెట్లూరు, వర్థినేనిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాల రైతులు శనివారం 836 బేళ్లు తీసుకురాగా 778 కొనుగోలయ్యాయి. 52 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.201, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.198.64 రైతులకు దక్కిందని నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

టంగుటూరులో సరాసరి ధర రూ.199

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల రైతులు 1047 బేళ్లు వేలానికి తీసుకురాగా 1018 కొనుగోలయ్యాయి. 29 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.201, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.199.72 పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

కనిగిరి రూరల్: బాలలను పనిలో పెట్టుకుంటే చట్ట రీత్య చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా బాల కార్మికుల నిర్మూలన చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లల చేత పనిలో చేర్పించుకున్నా, చేయించినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తొలుత హోటళ్లు, షాపులు, రెస్టారెంట్లు, తనిఖీలు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ కానిస్టేబుల్ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు కిరణ్‌కుమార్, రామలింగారెడ్డి, మండ్రు రమేష్, సుమతి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా రాము

కందుకూరు రూరల్: వ్యవసాయాధికారిగా వి.రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా కొండపి మండల నుంచి కందుకూరు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న వి.రవికుమార్, గుడ్లూరు, వలేటివారిపాలెం వ్యవసాయాధికారులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను రైతులకు అందేలా కృషి చేస్తానన్నారు.

14 నుంచి అచ్చమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని రఘునాథపురం కమ్మవారిపాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 14వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమై 18వ తేదీ ఆదివారంతో ముగుస్తాయని దేవస్థాన కమిటీ పేర్కొంది. 14వ తేదీన పశుపు కుంకుమ, సారెకావళ్లు, 15న గణపతిపూజ, కలశస్థాపన, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 16న మూలమంత్రం హోమాలు, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, గ్రామోత్సవం, 17న పూర్ణాహుతి, కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ, పెద్ద ఉత్సవ, 18న బండ్లు, పొంగళ్లు, ఉత్సవము, ఎడ్లపందాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌జీఓ రసూల్

పామూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల కేంద్రంలో శనివారం పాఠశాల పూర్వవిద్యార్థులు, ఎస్టీ కాలనీ పిల్లలతో కలిసి పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటి పెంచే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నాయబ్‌రసూల్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం ద్వారా ఒక ప్రాంతంలో అతివృష్టి, మరోప్రాంతంలో అనావృష్టి భిన్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. దీన్ని నివారించేందుకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణంను కాపాడం ఒక్కటే ఏకైక మార్గమన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలల్లో అధికారులు, విద్యార్థుల సహకారంతో స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షించేందుకు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలని షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, ఎస్టీకాలనీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గంథ మహోత్సవం



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మండలంలోని పొలావరంలో శుక్రవారం రాత్రి హజరత్ నాగూర్ మీరా స్వామి గంథ మహోత్సం అత్యంత వైభవంగా జరిగింది. హజరత్ వారి జెండాల ఊరేగింపును అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామ పురవీధుల్లో రాత్రి ఊరేగించారు. శనివారం తెల్లవారు జామున హజరత్ దర్గాకు సందల్ ఎక్కించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. విశిష్ట పూజ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత దర్గాలో మున్సిపల్ చైర్మన్‌ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాదులు హన్ను, బన్ను, విజేత విద్యా సంస్థల అధినేత అరుణోదర్, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, బారాహిమామ్, అక్బర్లు, షబ్బీర్, సమద్, వివిధ పార్టీల నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మేలైన మొక్కలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త విజయభాస్కర్

ఉలవపాడు: ఉద్యాన పంటలు వేసుకునేటప్పుడు మేలైన మొక్కలను ఎంపిక చేసుకోవాలని ఉద్యాన శాస్త్రవేత్త, కందుకూరు ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్ అన్నారు. స్థానిక మన్నేటికోట సచివాలయ పరిధిలో రైతులకు ఉద్యాన పంటలపై శనివారం సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జామ పంటలకు వచ్చే నులిపురుగుల నివారణ, ఎండు తెగులుకు సంబంధించి నివారణ చర్యలను తెలియచేశారు. నేరేడు, ఉసిరి, పనస తదితర మొక్కలను కంచె పంటలు వేసుకోవాల్సిందిగా సూచించారు. మెట్ట ప్రాంత ఉద్యాన పంటలలో రైతులకు వచ్చే సమస్యలు వాటికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మామిడిలో పంట కోత అనంతరం మార్కెట్‌కు తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేశారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా చూసుకోవాలి



మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హనుమంతునిపాడు: దోమలను కుట్టకుండా చూసుకోవాలని డాక్టర్ ప్రతాపురెడ్డి అన్నారు. స్థానిక ఆస్పత్రి నుంచి మలేరియా నివారణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రతోనే వ్యాధులు దూరమన్నారు. చెత్త చెదారం ఎక్కడంటే అక్కడ వేయకుండా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మలేరియా నివారణకు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు ప్రతాపురెడ్డి, సందీప్, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు ,ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా కరుణానిధి జయంతి వేడుకలు



కరుణా నిధి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి శత జయంతి వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. నాయి బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుగుణావతమ్మ సెంటర్‌లో కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ఎంతగానో పోరాటం చేశారన్నారు. పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయి బ్రహ్మణ సంఘ నాయకులు చింతలపూడి వెంకటేశ్వర్లు, చెరుకూరి చిన కాశయ్య, పాలూరి సత్యం, ద్రోణాదుల చెంచులు, పచ్చచంద్ర శేఖర్, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, బీసీ, ప్రజా సంఘాల నాయకులు పల్లా మాలకొండయ్య, బాలగురవయ్య, శేషయ్య, కోమటిగుంట్ల బాబురావు, ఈదర రవికుమార్, పాలూరి నారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు దుర్ఘటనపై హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు

కొండపి/టంగుటూరు/మర్రిపూడి: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ సమీపంలోని బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి సంభవించిన ఘోర రైలు ప్రమాదంలో కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా చిక్కుకున్నట్లయితే సమాచారం తెలియజేయాలని కొండపి, టంగుటూరు, మర్రిపూడి తహసీల్దార్లు పి.నర్సింగరావు, సంజీవరావు, జగదీష్‌రావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో విజ్ఞప్తి చేశారు. షాలిమార్-చైన్నై ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన వారు ఉంటే ఫొటోలు పంపాలని కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నం.8886616062, 8886616065, 7658954700, టంగుటూరులో హెల్ప్‌లైన్ నం.9515572374, మర్రిపూడిలో హెల్ప్‌లైన్ నం.9398060210 ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పామూరు: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనలో మండలంలోని వారు ఎవరైనా మృతిచెందినా, గాయపడి ఉన్నా, ఆచూకీ తెలియకపోయినా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసి హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ మిడసల జ్వాలానరసింహం తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్లు 9666533861, 9492536562కు సమాచారం ఇవ్వాలని కోరారు.

హనుమంతునిపాడు: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనలో మండలానికి సంబంధించిన వారు ఏవరైనా ఉంటే సమాచారం తెలియజేయాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 8886616056 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

5 నుంచి జగనన్నకు చెబుదాం

లింగసముద్రం: ఈ నెల 5 నుంచి ప్రతి సోమవారం జగనన్నకు చెబుతాం స్పందన కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. మండల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జగనన్నకి చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండల ప్రజలు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మద్యాహ్నం 1.30 గంటల వరకు తమ సమస్యలను తెలపవచ్చన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మండల స్థాయి అధికారులు ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

నేడు వ్యక్తిత్వ వికాస శిక్షణ

టంగుటూరు: మండలంలోని కందులూరు నిర్మల్ విద్యానికేతన్‌లో ఆదివారం వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ తెలిపారు. స్టెప్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పిల్లల పెంపకంలో తల్లితండ్రుల పాత్ర అంశంపై విషయ బోధన చేస్తారని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఇండ్ల ఏసుబాబు, మన్నం వెంకయ్య తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

పొదిలి: పిచ్చికుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం తాలూకా ఆఫీసు వీధిలో చోటుచేసుకుంది. గుంపుగా వచ్చిన కుక్కలు వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై దాడి చేశాయి. అనంతరం ఓ మహిళను వెంబడించి గాయపరిచాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.